07-07-2025
సోమవారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 03 | సంచిక : 44 | పేజీలు : 8 | వెల : 5
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

JB జయభేరి



## చరిత్ర సృష్టించిన
# టీమిండియా..
### ఇంగ్లాండ్‌పై రెండో టెస్టులో అపూర్వ విజయం

**ఇంగ్లాండ్‌తో జరిగిన రెండవ టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా 336 పరుగుల భారీ తేడాతో గెలిచింది. కెప్టెన్ శుబ్‌మన్ గిల్ రెండు ఇన్నింగ్స్‌లలోనూ సెంచరీలు చేసి అద్భుతంగా ఆడాడు. మొదటి ఇన్నింగ్స్‌లో సిరాజ్, రెండవ ఇన్నింగ్స్‌లో ఆకాశ్ దీప్ అద్భుతమైన బౌలింగ్‌తో 6 వికెట్లు తీశారు.**

బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టెస్టులో టీమిండియా ఘన విజయం సాధించింది. ఏకంగా 336 పరుగుల భారీ తేడాతో ఈ మ్యాచ్ గెలిచింది గిల్ సేన. లీడ్స్ లో జరిగిన తొలి టెస్టులో ఓటమికి ఈ విజయంతో బదులుతీర్చుకుంది. మొత్తం ఐదు టెస్టుల సిరీస్‌లో ప్రస్తుతం ఇరు జట్లు 11తో సమంగా ఉన్నాయి. ఈ మ్యాచ్‌లో కెప్టెన్ శుబ్‌మన్ గిల్ తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ, రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీతో అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. అలాగే టీమిండియా బౌలర్ల లో తొలి ఇన్నింగ్స్‌లో సిరాజ్ 6, రెండో ఇన్నింగ్స్‌లో ఆకాశ్ దీప్ 6 వికెట్లతో సత్తా చాటారు. 600లకు పైగా పరుగుల భారీ టార్గెట్‌తో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన ఇంగ్లాండ్‌ను భారత బౌలర్లు కేవలం 271 పరుగులకే ఆలౌట్ చేశారు. జూలై 2న ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ తీసుకున్నాడు. ఇక తొలి ఇన్నింగ్స్‌కు దిగిన భారత్ ఏకంగా 587

...మిగతాది 2 లో

## ఎటు చూసినా ఆర్తనాదాలే..!
# ఎవరిని కదిపినా కన్నీటి వ్యథలే..!

■ **సిగాచి ప్రమాదం - 42కు చేరిన మృతుల సంఖ్య**

**జయభేరి, హైదరాబాద్ :**

సిగాచి ప్రమాదంలో హృదయవిదారక దృశ్యాలు కనిపిస్తున్నాయి. మట్టి తవ్వకాల తరహాలో మనుషుల అవశేషాలను వెతుకుతుండటం చూసి బాధిత కుటుంబాలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాయి. కడసారి చూపుకైనా నోచుకోలేదు... కనీసం తమవాళ్లకు సంబంధించిన ఒక్క అవశేషం దొరికినా చివరి కార్యాన్నైనా జరుపుతామంటూ గుండెలు బాదుకుంటూ విలపిస్తున్నారు. పేలుడు ధాటికి కొందరి శరీర భాగాలు యంత్రాలకు అతుక్కోవడం చూసి అల్లాడిపోతున్నారు. సిగాచి పేలుడు ప్రమాదంలో మృతుల సంఖ్య 42కి చేరింది. ఆచూకీ లేని 9మందిలో ఆదివారం

...మిగతాది 2 లో



## మహారాష్ట్ర రాజకీయాల్లో
# కీలక పరిణామం

■ **20 ఏళ్ల తర్వాత ఒకే వేదిక పై మళ్లీ కలిసిన థాక్రే సోదరులు**

**జయభేరి, ముంబై జూలై 6:**

మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. థాక్రే సోదరులు (ఉద్ధవ్ థాక్రే, రాజ్ థాక్రే) మళ్లీ కలిశారు దాదాపు 20 ఏళ్ల తర్వాత ఒకే వేదిక పంచుకున్నారు. ఇకపై ఇద్దరం కలిసే ఉంటామని ఈ సందర్భంగా సోదరులు స్పష్టం చేశారు.త్రిభాషా విధానం అమలుకు సంబంధించిన ఉత్తర్వులను మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ఉపసంహరించుకున్న

...మిగతాది 2 లో



## బ్రెజిల్‌లో ప్రధాని మోదీకి
# సంగీత స్వాగతం



■ **మంత్రముగ్ధులను చేసిన బ్రెజిలియన్ టీమ్!**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 4 రోజుల పర్యటన నిమిత్తం బ్రెజిల్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొంటారు. గేలియో అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్న ప్రధాని మోదీకి ఘన స్వాగతం లభించింది. బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డా సిల్వా ఆహ్వానం మేరకు ప్రధానమంత్రి పర్యటిస్తున్నారు. ఐదు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ బ్రెజిల్‌లోని రియో డి జనీరో చేరుకున్నారు. ఈ సందర్భంగా భారత ప్రవాసులు ప్రధాని మోదీకి అనూహ్య స్వాగతం పలికారు. బ్రెజిలియన్ సంగీత బృందం సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రధాని మోదీకి ఘన స్వాగతం లభించింది. “జై జగదంబ మా దుర్గా” అనే భక్తి గీత ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, దేశ భక్తి చిత్రాలతో ప్రధాని మోదీకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజలు తమ చేతుల్లో త్రివర్ణ పతాకంతో ప్రధానికి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్ సంబంధించిన ఒక దృశ్యం కనువిందు చేసింది. పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులపై భారత్ నిర్వహిస్తున్న ఆపరేషన్ ఆధారంగా ఈ ప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది. ఈ మొత్తం కార్యక్రమం డాన్స్, చిత్రాల ద్వారా ప్రదర్శించారు.

...మిగతాది 2 లో

# సారు మా బడికి రండి!
### సీఎం, డిప్యూటీ సీఎంకు స్టూడెంట్స్ లేఖలు



**తూర్పుగోదావరి జిల్లా, సీతానగరం మండలం వెదుళ్ళపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థుల వినూత్న ప్రదర్శన చేశారు. ప్రభుత్వ స్కూల్‌లో అన్ని సదుపాయాలు కల్పిస్తూ పేద విద్యార్థులను ప్రభుత్వ బడిలో చదువుకునేలా ప్రోత్సహిస్తున్నందుకు తల్లిదండ్రులకు, సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు, విద్యాశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతూ ఉత్తరాలు రాశారు.**

**జయభేరి, తూర్పుగోదావరి :**

మేమంతా రుణపడి ఉంటామంటూ ఆ ఉత్తరాల్లో పేర్కొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల నుంచి నుండి పోస్ట్ ఆఫీస్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి స్వయంగా విద్యార్థులే ఉత్తరాలను పోస్ట్ బాక్స్‌లో వేశారు. పాఠశాలలో తమకు అందుతున్న సౌకర్యాలు, విద్యాబోధన గురించి ఉత్తరాల్లో తల్లిదండ్రులకు వివరించారు. అలాగే ఈ నెల 10వ తేదీన జరగబోయే మెగా పేరెంట్స్ మీట్‌కు రావాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రికి ఆహ్వానం పంపారు. అంతేకాకుండా ప్రభుత్వం అందిస్తున్న తల్లికి వందనం, సన్న బియ్యంతో భోజనం, విద్యామిత్ర కిట్లు వంటి పథకాలు అందుబాటులోకి

...మిగతాది 2 లో

## చిన్నారుల హక్కులు లైంగిక వేధింపుల నుంచి రక్షణ



**జయభేరి, హైదరాబాద్ :**

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్ సింగ్ ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. స్టేట్ లెవెల్ స్టేక్ హోల్డర్స్ కన్సల్టేషన్ మీట్ 2025 లో పాల్గొనడానికి జస్టిస్ విక్రమ్ సింగ్ హైదరాబాద్ వచ్చారు. డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం MCRHRD లో “నిస్సహాయకులకు అండగా – చిన్నారుల హక్కులు, లైంగిక వేధింపుల నుంచి రక్షణ ” అన్న అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు ముగింపు కార్యక్రమంలో జస్టిస్ విక్రమ్ సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ పోలీసు, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, యునిసెఫ్ (UNICEF), తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ TSLSA సంయుక్తంగా నిర్వహించిన రెండురోజుల సదస్సు ఆదివారం ముగిసింది.



## నేషనల్ మెడికల్ కమిషన్‌లో ఇంటి దొంగలు

2 లో



## స్నేహానికన్న మిన్న.. ఏదీ లేదురా...

2 లో



## ప్రభుత్వ భూములు కబ్జాలు చేసి.. అమ్ము కోవడమే సీఎం విధానమా

2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## బ్రెజిల్‌లో ప్రధాని మోదీకి సంగీత స్వాగతం

బ్రెజిల్ చేరుకున్న తర్వాత ప్రధాని మోదీ మాట్లాడుతూ, "రియో డి జనీరోలో బ్రెజిల్‌లోని భారతీయ సమాజ సభ్యులు నాకు చాలా హృదయపూర్వక స్వాగతం పలికారు. వారు భారతీయ సంస్కృతితో ఎంతగా ముడిపడి ఉన్నారో, భారతదేశ అభివృద్ధి పట్ల వారికి ఎంత మక్కువ ఉందో ఆశ్చర్యంగా ఉంది" అని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాలుగు రోజుల పర్యటన నిమిత్తం బ్రెజిల్ చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా జూలై 6 మరియు 7 తేదీల్లో రియో డి జనీరోలో జరిగే బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో ఆయన పాల్గొంటారు. దాదాపు ఆరు దశాబ్దాల తర్వాత భారత ప్రధానమంత్రి ఆ దేశానికి రావడం ఇదే తొలిసారి. బ్రెజిల్ చేరుకునే ముందు, ప్రధానమంత్రి మోదీ అర్జెంటీనాకు ద్వైపాక్షిక పర్యటనను పూర్తి చేశారు - 57 సంవత్సరాలలో ఒక భారత ప్రధానమంత్రి చేసిన మొదటి పర్యటన ఇది.
అక్కడ ఆయన అధ్యక్షుడు జేవియర్ మిలేతో విస్తృత చర్చలు జరిపారు. ఈ పర్యటనలో రక్షణ, కీలకమైన ఖనిజాలు, ఔషధాలు, శక్తి, మైనింగ్ వంటి రంగాలలో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని విస్తృతం చేయడానికి, సహకారాన్ని పెంపొందించడానికి ఒప్పందాలు కుదిరాయి. ఇదిలావుంటే, బ్యూనస్ ఎయిర్స్ నగర ప్రభుత్వం ప్రధాని మోదీని ఘనంగా సత్కరించింది. ఆ నగర ప్రభుత్వ అధిపతి జార్జ్ మాక్రీ, ప్రధాని మోదీకి 'కీ టు ది సిటీ' అవార్డును బహుకరించారు. ఇది భారతదేశంఅర్జెంటీనా సంబంధాలకు మోదీ చేసిన కృషికి ప్రతీక. "మిస్టర్ జార్జ్ మాక్రి నుండి బ్యూనస్ ఎయిర్స్ నగర తాళంచెవిని స్వీకరించడం గౌరవంగా ఉంది" అని ప్రధాన మంత్రి Xలో పోస్ట్ చేశారు.

## సారు మా బడికి రండి!

తీసుకురావడం తమకు ఎంతో అండగా నిలుస్తోందని సీఎం చంద్రబాబుకు 20 మంది విద్యార్థులు ఉత్తరాలు రాశారు, డిప్యూటీ సీఎంకు 13 మంది, విద్యాశాఖ మంత్రికి 10 మంది విద్యార్థులు ఉత్తరాల ద్వారా కృతజ్ఞతలు తెలిపారు. ఇక విద్యాశాఖ అధికారులకు, డీఈవో, ఏపీసీ, ఎంఈవోలకు 10 మంది విద్యార్థులు ఉత్తరాలు రాశారు. స్కూల్‌స్‌లో అన్ని వసతులు కల్పించినందుకుగాను స్థానిక ఎమ్మెల్యేకు సైతం ఏడుగురు విద్యార్థులు ఉత్తరాలు రాశారు. తాము చదువుకునేందుకు పాఠశాలలో అన్ని వసతులు కల్పిస్తున్న ప్రభుత్వానికి, అధికారులుకు ఉత్తరాలతో కృతజ్ఞతలు తెలపాలనే విద్యార్థుల వినూత్న అలోచనకు స్థానికులు ఫిదా అవుతున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు మండలంలోని తల్లిదండ్రులకు కృతజ్ఞతలుగా ఉత్తరాలతో పంపిన విద్యార్థులు పోస్ట్‌లు ఇప్పుడు వైరల్‌గా మారడంతో పాటు జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి.

## చరిత్ర సృష్టించిన టీమిండియా..

పరుగుల భారీ స్కోర్ చేసింది. కెప్టెన్ గిల్ 387 బంతుల్లో 30 ఫోర్లు, 3 సిక్సులతో 269 పరుగులు సంచలన ఇన్నింగ్స్ ఆడాడు. అలాగే ఓపెనర్ యశస్వి జైస్వాల్ 87, రవీంద్ర జడేజా 89, వాషింగ్టన్ సుందర్ 42 పరుగులతో టీమిండియాకు పెద్ద స్కోర్ అందించడంతో కీలక పాత్ర పోషించారు.
ఆ తర్వాత టీమిండియా ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో గట్టి జవాబే ఇచ్చింది. కేవలం 84 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన తర్వాత కూడా హ్యారీ బ్రూక్(158), జేమీ స్మిత్ (184) పోరాటంతో 407 పరుగులు చేసి ఆలౌట్ అయింది. టీమిండియా బౌలర్లలో సిరాజ్ బుమ్రా లేని లేటు పూడుస్తూ 6 వికెట్లతో చెలరేగిపోయాడు. అలాగే ఆకాశ్ దీప్ సైతం 4 వికెట్లు పడగొట్టాడు. ఇక మంచి లీడ్‌తో రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన టీమిండియా ఈసారి కూడా భారీ స్కోర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీతో కదం తొక్కిన గిల్ రెండో ఇన్నింగ్స్‌లోనూ భారీ ఇన్నింగ్స్ ఆడాడు.
162 బంతుల్లో 13 ఫోర్లు, 8 సిక్సులతో 161 పరుగులు చేసి మళ్లీ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కేఎల్ రాహుల్ 55, రిషభ్ పంత్ 65, జడేజా 69 పరుగులతో రాణించారు. మొత్తంగా ఇంగ్లాండ్‌కు టీమిండియా 600 ప్లస్ టార్గెట్ ఇచ్చింది. ఇక భారీ టార్గెట్ తో మరిలోకి దిగిన ఇంగ్లాండ్‌కు ఆకాశ్ దీప్ చుక్కలు చూపించాడు.
ఏ దశలోనూ ఇంగ్లాండ్ లక్ష్యం దిశగా సాగలేదు. ఈ సారి కూడా జేమీ స్మిత్ 88 పరుగులతో పోరాటం చేసినా.. టీమిండియా బౌలర్ల ముందు నిలబడలేకపోయాడు. ఇంగ్లాండ్‌కు ఓటమిని తప్పించలేకపోయాడు. స్మిత్ తప్ప మిగతా బ్యాటర్లు ఎవరూ కూడా పెద్దగా రాణించలేదు. ఆకాశ్ దీప్ అద్భుతమైన బౌలింగ్ ముందు వాళ్లు తలొంచారు. మొత్తంగా 68.1 ఓవర్లలో ఇంగ్లాండ్ 271 పరుగులు చేసి ఆలౌట్ అయింది. టీమిండియా ఎడ్జ్‌బాస్టన్‌లో తొలి విజయాన్ని నమోదు చేసింది. ఏకంగా 336 పరుగుల భారీ తేడాతో ఈ విజయం సాధించింది. టీమిండియా బౌలర్లలో ఆకాశ్ దీప్ 6 వికెట్లు, సిరాజ్, ప్రసిద్ కృష్ణ, జడేజా, సుందర్ తలో వికెట్ తీసుకున్నారు. ఈ విజయంతో కొత్త కెప్టెన్‌కు తొలి విజయం దక్కింది.

## ఎవరిని కదిపినా కన్నీటి వ్యథలే..!

ఒకరిని గుర్తించారు. డీఎన్ఏ పరీక్ష ద్వారా అవశేషాలు గుర్తించి వాళ్ల కుటుంబ సభ్యులకు అప్పగించారు. పరిశ్రమలో ఇంకా లభించని ఎనిమిది మంది ఆచూకీ కోసం రెస్క్యూ ముమ్మరం చేశారు. అణువణువు జల్లెడపడుతున్నారు. ఇలా గుణపాలతో కార్మికుల అవశేషాలను గుర్తించేందుకు NDRF, హైడ్రా, మున్సిపల్ సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తోంది. ఇటు ప్రమాదంలో తీవ్రగాయాలైన 18 మంది ధృవ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరోవైపు 15 బోన్ శాంపిల్‌స్‌ను DNA రిపోర్ట్స్ కోసం పంపించారు. ఇదిలావుంటే.. సేఫ్టీ రూల్స్ పాటించకపోవడంతోనే సిగాచి కంపెనీలో ప్రమాదం జరిగినట్లు ప్రభుత్వం నియమించిన హైలెవల్ కమిటీ ఇప్పటికే ప్రాథమికంగా నిర్ధారించింది. దీనిపై పూర్తిస్థాయిలో క్లారిటీ వస్తే సిగాచి కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ప్రమాదంపై కన్నెర్ర చేస్తున్నాయి కార్మిక సంఘాలు. పరిశ్రమ దగ్గర పెద్దఎత్తున ఆందోళనకు దిగాయి.
బాధిత కుటుంబాలను పరిశ్రమ యాజమాన్యం, ప్రభుత్వం పట్టించుకోవట్లేదంటూ కార్మిక నేతలు నిప్పులు చెరుగుతున్నారు. పరిశ్రమ లోపలికి అనుమతివ్వాలని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కనీసం మిస్సయినవారి ఆచూకీనైనా వెంటనే కనిపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. మొత్తంగా... ఓవైపు బాధిత కుటుంబాల ఆర్తనాదాలు... మరోవైపు కార్మికుల అవశేషాలు గుర్తించేందుకు అధికారుల ప్రయత్నాలు... ఇంకోవైపు న్యాయం కోసం కార్మిక సంఘాల ఆందోళనలతో పాశమైలారంలో భారీగా మోహరించారు పోలీసులు.

## మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం

విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఇవాళ ముంబైలో 'వాయిస్ ఆఫ్ మరాఠీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శివసేన చీఫ్ ఉద్ధవ్ థాక్రే మహారాష్ట్ర నవ నిర్మాణ సేన చీఫ్ రాజ్ థాక్రే ఇద్దరూ కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇద్దరూ ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. 2005లో విడిపోయిన ఈ ఇద్దరు అన్నదమ్ములు 20 ఏళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ కలుసుకోవడం మహారాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. అన్నదమ్ముల కలయికపై ఇరు పార్టీల కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వల్లే తాము కలిశామని రాజ్ థాక్రే వ్యాఖ్యానించారు. సీఎం రాష్ట్రానికి వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయమే తమని కలిపిందన్నారు. అనుకోకుండానే ఒకే వేదికపై చేర్చారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై థాక్రే సోదరులు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఇకపై తామిద్దరం ఒక్కటిగా ఉంటామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కాగా, అన్నదమ్ములిద్దరూ చివరి సారిగా 2005లో ఒకేవేదికపై కనిపించారు. ఆ తర్వాత శివసేనలో గొడవల కారణంగా రాజ్ థాక్రే పార్టీ వీడారు. 2006 మార్చి 9వ తేదీన సొంతంగా మహారాష్ట్ర నవ నిర్మాణ సేనను స్థాపించారు.

# నేషనల్ మెడికల్ కమిషన్‌లో ఇంటి దొంగలు

**దేశవ్యాప్తంగా అనేక మెడికల్ కాలేజీలను తనిఖీ చేయాల్సిన నేషనల్ మెడికల్ కమిషన్‌లో భారీ స్కాం బయటపడింది. ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా దేశవ్యాప్తంగా 36 మంది వైద్యులు, పలు మెడికల్ కాలేజీలపై సీబీఐ కేసు నమోదు చేసింది. వీరిలో తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన పలువురు వైద్యులు సైతం ఉండటం విశేషం. అసలేంటి మెడికల్ స్కాం దీన్ని ఫ్రాడ్ చేశారు.? మెడికల్ కాలేజీలను అనునిత్యం తనిఖీ చేయాల్సిన అధికారుల ప్రైవేట్ మెడికల్ కాలేజీ యాజమాన్యాలతో కుమ్మక్కయి వారికి ముందస్తు సమాచారం చేరవేస్తూ తనిఖీ జరిగిన సమయంలో ఎలాంటి అవకతవకలు లేవు అని నిరూపించేలా ముందస్తు సమాచారాన్ని లీక్ చేస్తున్నాయి.**

✍ **జయభేరి, న్యూఢిల్లీ, జూలై 6:**





నేషనల్ మెడికల్ కమిషన్ లోని ఇన్స్పెక్షన్ సభ్యులుగా ఉన్న పలువురితో కలిసి కేంద్ర ప్రభుత్వ హెల్త్ అండ్ వెల్ఫేర్ శాఖలోని పలువురు అధికారులు కలిసి ఈ అక్రమాలకు పాల్పడ్డారు..సాధారణంగా మెడికల్ కాలేజీలో వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం చాలా సీరియస్ గా ఉంటుంది. మెడికల్ కాలేజీలలో పరికరాలు, వసతులు మెడికల్ కాలేజీల అనుమతులు, రెన్యువల్ చేసుకునే విధానాలపై పటిష్టమైన నిబంధనలు కేంద్ర ప్రభుత్వం విధించింది. వీటి మొత్తాన్ని మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ వెల్ఫేర్ లో పనిచేసే పలువురు అధికారులు పరిస్థితి మొత్తాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. వీరితోపాటు నేషనల్ మెడికల్ కమిషన్ లో పనిచేసే ఇన్స్పెక్షన్ బృందంలోని సభ్యులు మెడికల్ కాలేజీలకు వెళ్లే ముందే ఏ కాలేజీ కి వెళ్తున్నామో వారికి ముందస్తు సమాచారం ఇచ్చి వారి నుండి పెద్ద మొత్తంలో ముడుపులు వసూలు చేస్తున్నారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా లక్షలు కోట్ల రూపాయలను ఈ తరహాలో అక్రమంగా సంపాదిస్తున్నారు.ఈ భాగోతం కేవలం ఒక రాష్ట్రానికి పరిమితం కాలేదు. దేశవ్యాప్తంగా అనేక మెట్రో నగరంలో ఉన్న మెడికల్ కాలేజీలలో ముఖ్యంగా ప్రైవేట్ మెడికల్ కాలేజీలలో ఈ వ్యవహారం నడుస్తుంది. మెడికల్ కాలేజీలలో తనిఖీకి వెళ్లే ముందే ఆయా కళాశాలలకు ఎంఎంసీ లోని కీలక సభ్యుల నుంచి సమాచారం వెళ్ళటంతో మెడికల్ కాలేజ్ యాజమాన్యాలు తగిన జాగ్రత్తలు తీసుకొని తనిఖీ సమయంలో వచ్చిన అధికారులకు లక్షల రూపాయలు అప్పజెబుతున్నారు. బెంగళూరు ఇండోర్లీ డిల్లీ ఉదయపూర్ ఏపీ తెలంగాణ ప్రాంతంలో ఉన్న మెడికల్ కాలేజీ ల యాజమాన్యాలను కాలేజీల డైరెక్టర్లను సిబిఐ నిందితుల జాబితాలో చేర్చింది. ముందస్తు సమాచారాన్ని ప్రైవేటు కాలేజ్ యాజమాన్యాలకు చేర్చినందుకు కేంద్ర ప్రభుత్వంలో పనిచేసే అధికారులకు హవాలా మార్గంలో చెల్లింపులు వెళుతున్నట్టు సిబిఐ దర్యాప్తులో బయటపడింది. చతిస్గడ్ లోని రావత్ పురా సర్కార్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ చైర్మన్ రవిశంకర్ జి, అదే కాలేజీలో డైరెక్టర్ గా ఉన్న అతుల్ కుమార్ తివారి, రాజస్థాన్ గీతాంజలి యూనివర్సిటీ రిజిస్టర్ మయూర్, ముంబై టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ స్టడీస్ ఛాన్సలర్ డిపి సింగ్, వైజాగ్ గాయత్రి మెడికల్ కాలేజ్ డైరెక్టర్ వెంకట్, ఫాదర్ కొలంబో మెడికల్ సైన్సెస్ వరంగల్ కాలేజ్ డైరెక్టర్ జోసెఫ్ పై కేస్ నమోదు చేశారు సిబిఐ అధికారులు. దీనితోపాటు నేషనల్ మెడికల్ కమిషన్ సభ్యులు డాక్టర్ మంజప్ప, డాక్టర్ చరిత, డాక్టర్ రజిని రెడ్డి, డాక్టర్ అశోక్ లను సిబిఐ నిందితులుగా చేర్చింది. ఇక మరోవైపు నేషనల్ హెల్త్ అథారిటీ జాయింట్ డైరెక్టర్‌తో పాటు హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారులు మొత్తం ఎనిమిది మంది ను సైతం సీబీఐ నిందితుల జాబితాలో చేర్చింది.ఈ విధంగా మొత్తం 36 మందిపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.ఇక దక్షిణ రాష్ట్రాలకు సంబంధించి హర్యానాకు చెందిన డాక్టర్ వీరేంద్ర కుమార్ కీలకపాత్ర పోషించారు. ఏపీ, తెలంగాణతో పాటు బెంగళూరులో ఉన్న మెడికల్ కాలేజీలలో కావాల్సిన అనుమతులు ఇక్కడ తనిఖీల సందర్భంలో ముందస్తు సమాచారాన్ని కదిరి అనంతపురంకు చెందిన డాక్టర్ హరీ ప్రసాద్ ద్వారా ఏపీ తెలంగాణ్ లో ఉన్న పలు ప్రైవేట్ మెడికల్ కాలేజ్ లకు ముందస్తు తనిఖీ సమాచారం చెప్పిన వీరేంద్ర కుమార్..వీటితో పాటు వైజాగ్ లోని గాయత్రి మెడికల్ కాలేజీ, వరంగల్ లో నీ ఫాదర్ కొలంబో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కాలేజ్ లకు కావలసిన పనులు మొత్తం హరి ప్రసాద్ తో పాటు డాక్టర్ అంకం రామ్ బాబు, డాక్టర్ కృష్ణ కిషోర్ సరి చేసేవారు. ప్రైవేట్ కాలేజ్ యాజమాన్యాలు ఇచ్చే డబ్బు మొత్తాన్ని దక్షిణ రాష్ట్రాల నుండి డాక్టర్ హరి ప్రసాద్ కలెక్ట్ చేసేవారు. డాక్టర్ హరిప్రసాద్ నుండి డాక్టర్ వీరేంద్ర కుమార్ కి హవాలా రూపంలో ఈ డబ్బు చేరేది. వరంగల్ కొలంబో కాలేజ్ కు చెందిన ఫాదర్ జోసెఫ్ 2 దఫాలుగా 66 లక్షల రూపాయలను చెల్లించాడు.కొద్దిరోజులు కూర్చుని అనంతపురం జిల్లా కదిరిలో డాక్టర్ హరిప్రసాద్ ఇంటిపై సీబీఐ అధికారులు తనిఖీలు చేశారు. కీలక డాక్యుమెంట్ లతోపాటు పలు సామాగ్రిని సీబీఐ స్వాధీనం చేసుకుంది. అధికారులు తనిఖీలకు వచ్చిన సందర్భంలో టెంపరరీగా ఫ్యాకల్టీని అద్దెకు తీసుకొచ్చి, ఇక్కడ ఎలాంటి అక్రమాలు జరగడలేదని ఇన్స్పెక్షన్ రిపోర్టు రాయించుకునేవారు. రిపోర్టు రాసినందుకు సభ్యులకు లక్షల రూపాయల కొద్దీ ముడుపులు చెల్లించేవారు. ఇక హెడ్ ఆఫీస్ లోను పలువురు సభ్యుల తీరు ఆశ్చర్యానికి గురిచేసింది. ఇన్స్పెక్షన్ జరగబోయే కాలేజీ లకు సంబంధించి రిపోర్టులను ఫోటోలు తీసి మరి ఆ ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలకు పంపించి డబ్బులు దండుకున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై అనేక చోట్ల సీబీఐ తనిఖీలు నిర్వహించింది. త్వరలోనే ఈ స్కాంలో అరెస్ట్ ల పర్వం కొనసాగనుంది.



## స్నేహానికన్న మిన్న.. ఏదీ లేదురా...

- ఎమ్మెల్యే వేముల వీరేశం చేసిన సహాయానికి కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబం..
- మానవత్వాన్ని చాటిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం...
- తన చిన్ననాటి స్నేహితుని అకాల మరణానికి భరోస కల్పించి ఆ కుటుంబానికి ధైర్యంగా నిలిచారు.
- ఇద్దరు ఆడపిల్లల ఉన్నత చదువులకు సహాయం చేస్తారంటూ హామీ ఇచ్చిన ఎమ్మెల్యే వేముల వీరేశం

✍ **జయభేరి, నకిరేకల్ :**



చిన్ననాటి స్నేహితుని అకాల మరణానికి అండగా నిలబడ్డారు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం. తన తోటి చదువుకున్న గాజుల భాస్కర్ అకాల మరణానికి చింతిస్తూ ఆ కుటుంబానికి అండగా నిలబడతానని హామీ ఇచ్చారు. శాలిగౌరారం మండలం ఇటుకల పహాడ్ గ్రామానికి చెందిన గాజుల భాస్కర్ అకాల మరణానికి చింతిస్తూ నకరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సందర్శించి అతని భార్య పిల్లల్ని పరామర్శించి వారికి భరోసగా నిలబడ్డారు. ఇక అసలు విషయాల్లోకి వస్తే 1992,93 పదవ తరగతి చదువుతున్న వారిలో వేముల వీరేశం ఉన్నారు. తన క్లాస్మెట్ గాజుల భాస్కర్ అకాల మరణం చెందారని తన స్నేహితుల ద్వారా తెలుసుకొని పార్థివ దేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి భరోసాగా నిలిచారు నగరికల్ ఎమ్మెల్యే వేముల వీరేశం. ఈ సందర్భంగా వేముల వీరేశం గాజుల భాస్కర్ కు ముగ్గురు పిల్లలు ఇద్దరు ఆడపిల్లలు ఒక మగ పిల్లవాడు. అతని భార్యతో మాట్లాడుతూ ఇద్దరి పిల్లల ఉన్నత చదువుల కోసం తాను అండగా నిలబడతానని వారి చదివినంత కాలం వారి చదువుకు సహకరిస్తానని మాట ఇచ్చారు. అంతేకాకుండా పిల్లలతో మాట్లాడుతూ.. భయపడొద్దు నేను మీకు సహాయంగా ఉంటాను అంటూ ధైర్యాన్ని అందించారు. వాళ్ళ కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకొనుటకు రాములు అనే వ్యక్తిని అన్ని వివరాలు తీసుకొని తనను సంప్రదించాల్సిందిగా ఆదేశించారు. వారికి ఆర్థిక సహాయాన్ని వెంటనే అందించారు. అలాగే వారికి సొంత ఇళ్లు కట్టుకుంటానికి నా వంతు సహాయం చేస్తానని తుంగతుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే ని అభ్యర్థిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గాజుల భాస్కర్ 10వ తరగతి చదివిన తన తోటి స్నేహితులు మాజీ సర్పంచ్ అల్లి సైదులు, గైగుల్ల అవిలయ్య, పుసోజు వీరయ్య, అల్లి వెంకన్న, పెరుమాండ్ల వీరయ్య, కడారి శ్రీనివాస్, ఎంఈఓ మందుల సైదులు, పోలేపాక సుదర్శన్, వెంకన్న శ్రీనివాస్, సందసాగర్, గరగంటి ప్రభాకర్, గోపాశి కన్నయ్య, జయరాజు సుధాకర్ సురేష్, పలువురు భారీ ఎత్తున గాజుల భాస్కర్ పార్థీవ దేహానికి వీడ్కోలు పలికారు.

## పటిష్టమైన ప్రణాళికతో సీసీ రోడ్ల నిర్మాణం

**కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డిని ఘనంగా సన్మానించిన మహేశ్వరి కాలనీవాసులు**



**హయత్ నగర్ :**

హయత్ నగర్ డివిజన్లోని మహేశ్వరి కాలనీలో భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్ నిర్మాణ పనులు పూర్తయిన సందర్భంగా కాలనీవాసులు స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డిని ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మౌలిక వసతులు కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ గత నాలుగున్నర సంవత్సరాలుగా హయత్ నగర్ లో ఉన్నటువంటి అన్ని కాలనీలో భూగర్భ డ్రైనేజ్, సీసీ రోడ్ నిర్మాణం, మంచి నిట్టి పైప్ లైన్ సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని, మహేశ్వరి కాలనీలో కూడా దాదాపు 50 లక్షల రూపాయల వ్యయంతో భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్ నిర్మాణం చేయడం జరిగిందని, వీలైనంత త్వరగా భూగర్భ డ్రైనేజ్, మంచినీటి పైప్ లైన్ నిర్మాణం పూర్తయిన చోట్ల పటిష్టమైన ప్రణాళికతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని వారు మహేశ్వరి కాలనీ సంక్షేమ సంఘం సభ్యులకు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహేశ్వరి కాలనీ అధ్యక్షులు పాండవ్ రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు శంకర్ గౌడ్, చంద్రబాబు, శ్రీధర్ రెడ్డి, నర్సింహులు, మల్లారెడ్డి, రామచంద్ర రెడ్డి, నరేందర్ రెడ్డి, కాలనీవాసులు, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు గొడుగులు పంపిణీ



**జయభేరి, చర్ల, జులై 6 :**

చర్ల విద్యార్థులపై దాతలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా చదువుపై దృష్టి పెట్టి ఉన్నత స్దితికి చేరుకోవాలని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్థి నిలయ గౌరవ సలహాదారు బివిఎస్ఎల్ నర్సింహారావు అన్నారు. సీనియర్ జర్నలిస్ట్, వనవాసీ నిలయ కమిటి ఉపాధ్యక్షులు జవ్వాది మురళీకృష్ణ సతీమణి కుమారి జన్మదినం పురస్కరించుకొని ఆదివారం వనవాసీ విద్యార్థులకు గొడుగులను పంపిణీ చేసారు. వనవాసీ ప్రఖండ ప్రముఖ్ గొంది శోభన్‌బాబు అధ్యక్షతన జరిగిన పంపిణీ కార్యక్రమంలో బివిఎస్ఎల్ఎన్ తో పాటు వనవాసీ ప్రాంత మహిళా సహ ప్రముఖ్ పెద్దాడ ఆశాలత, నిలయ కమిటి కార్యదర్శి మల్లాది సుబ్రమణ్యం లు విద్యార్థులను ఉద్దేసించి ప్రసంగించారు. దాతలు విద్యార్థులు మంచిగా చదివి అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్షింస్తూ వివిద వస్తువులు, భోజనాలను అందచేస్తున్నారని గుర్తుచేసారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా క్రమ శిక్షణతో చదివినపుడే వారి సహకారానికి ఫలితం ఉంటుందని అన్నారు.



వనవాసీ విద్యార్థులంటే క్రమ శిక్షణకు మారుపేరుగా బావిస్తారని, వారి భావనలకు అనుగుణంగా చదువులోనూ రాణించి నిలయానికి పేరుప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. మారుమూల అటవీప్రాంత గ్రామాలకు చెందిన ఇక్కడి విద్యార్థులు మైదాన ప్రాంత విద్యార్థులకు దీటుగా రాణించడం అబినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండి తమ సంపాదనలో కొంత మొత్తం పేద విద్యార్థుల చదువులకు వెచ్చించడం సంతోషకరమని అన్నారు. సీనియర్ జర్నలిస్ట్, నిలయ కమిటి ఉపాధ్యక్షుడు జవ్వాది మురళీకృష్ణ వనవాసీ విద్యార్థులకు చేస్తున్న సేవ ప్రశంసనీయమన్నారు. తల్లిదండ్రులు కూడా గమనించని విషయాలను గుర్తించి వారికి కావాల్సిన వస్తువులు, దుస్తులు, భోజన సౌకర్యం వంటివి ఏర్పాటు చేయడం అబినందనీయమన్నారు. ఇప్పకే వనవాసీ విద్యార్థులకు కావాల్సిన పరుపులు, సైకిల్స్, పాదరక్షలు, సీలింగ్ ఫ్యాన్, ట్రంకు పెట్టెలను సమకూర్చారన్నారు. ఇప్పుడు తన శ్రీమతి జన్మదినం సందర్భంగా విద్యార్థులు వర్షంలో తడవ కూడదనే ఉద్దేశంతో గొడుగులను అందించడం హర్షనీయమన్నారు. గతంలోనూ మండలంలో ఎవరూ చేయని విదంగా ఆదివాసీ మహిళలకు సొంత ఖర్చులతో సామూహిక సీమంతాలను నిర్వహించిన ఘణత వీరికే దక్కుతుందన్నారు. తన వృత్తిలో తీరిక లేకుండా ఉన్నప్పటికి వనవాసీ కి సమయం కేటాయించి వారికి కావాల్సిన వస్తువులను సమకూరుస్తున్నారని తెలిపారు. ఆర్భాటపు ప్రచారాలకు దూరంగా ఉంటూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. తొలిఏకాదశి సందర్భంగా ఆయిల్ బంక్ ఏరియా భక్తాంజనేయ స్వామి ఆలయ అర్చకులు అక్కిరాజు వెంకటేశ్వరరావు అందచేసిన టవల్స్ ను విద్యార్థులకు పంపిణీ చేసారు. కార్యక్రమంలో వనవాసీ నిలయ కమిటి కోశాదికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, సభ్యులు శివరాజు కిషోర్, రాజేష్, పాశిగంటి శ్రీదేవి, ఎం శ్రీనివాస్, నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి, సున్నం రాజేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# సినీ సంగీత స్వర సమీరాలు

**జయభేరి, హైదరాబాద్ :**

అమృత వర్షిని నాగభూషణ్ నిర్వహణలో నిర్విరామంగా కొనసాగుతున్న "అమృత వర్షిని ఆర్ట్స్ సినీ సంగీత స్వర సమీరాలు సీజన్ 9"సరిగా స్టూడియో సుల్తాన్ బజార్ హైదరాబాదులో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్విరామంగా ఎంతోకొలహలంగా జరిగింది. విభిన్నమైన పాటలతో గాయనీ గాయకులు అద్భుతంగా పాడి శ్రోతులను ఆలరించారు. ప్రతి సీజన్లో గాయకులను చేరదీసి వారికి చక్కని నివేదికను ఏర్పాటు చేస్తూ ప్రోత్సహిస్తున్న అమృత వర్షిని నాగభూషణ్ దంపతులను గాయని గాయకులు ఎంతగానో ప్రశంసించారు. మేమిక్రి ఆర్టిస్ట్ విద్రుతన మేమిక్రి చేసి అనర్గళంగా మాట్లాడుతూ సింగర్స్ అందరిని నవ్విస్తూ ఈవెంట్ కి ఒక కల తెచ్చి మా అందరిని ఆదరింప చేశారు. వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన గాయని గాయకులకు జ్ఞాపికులను గాయకు రాలు మాధవి గారు అందించి వారి సహృదయాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమం ఎంతో దిగ్విజంగా విజయవంతం కావడానికి సహకరించి కృతజ్ఞతలు తెలియజేశారు.

# వికలాంగుల సంఘం నూతన మండల కమిటీ ఎన్నిక




**జయభేరి, చర్ల, జులై 6 :**

చర్ల మండలం లోని వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నూతన మండల కమిటీ ఎన్నుకోవడం జరిగింది అధ్యక్షులుగా రేగళ్ల సుధాకర్ గారిని మండల అధ్యక్షుడిగా ఎన్నుకోవడం జరిగింది వయసు ప్రెసిడెంట్ గా ఈ ప్రసాద్ కార్యదర్శిగా బి సాగర్ సహాయ కార్యదర్శిగా జి సురేష్ రెడ్డి కోశాధికారిగా శెట్టి సుబ్రహ్మణ్యం జనరల్ సెక్రెటరీగా సంతపూర్ సతీష్ కార్యవర్గ సభ్యులుగా పూనం నానమ్మ కుంజా కమల కేశవులు శంకరాచారి వారందరినీ వికలాంగులకు మండలంలోని సంక్షేమ పథకాలు అందేలా ఈ యొక్క కమిటీ మీ యొక్క కమిటీ వికలాంగుల అందరూ తెలియజేయడం జరిగింది మారుమూల ప్రాంతాల్లో ఇప్పటికి సదరం సర్టిఫికెట్లు అందరి అందరూ దీనస్థితిలో ఉన్నారు పై అధికారులకు తెలియజేసి మా యొక్క హక్కులను మా యొక్క సంక్షేమ పథకాలను ప్రతి ఒక్క దివ్యాంగులకు అందేలా పోరాడుతామని మండల అధ్యక్షుడు రేగళ్ల సుధాకర్ తెలియజేశారు ఇట్లు వికలాంగుల హక్కుల పోరాట సమితి.



నాచారంలో శ్రీ సత్యభామ బిర్యాని సెంటర్ ను ప్రారంభించిన ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మా రెడ్డి. నాచారం ప్రధాన రహదారిపై క్రోమా డిజిటల్ ఎదురుగా నూతనంగా ప్రారంభించిన శ్రీ సత్యభామ బిర్యాని మొదటగా తానే బోనీ చేసి రుచి చూసి చాలా మంచి క్వాలిటీ బిర్యానీ ఉందని కితాబు ఇవ్వడం జరిగింది. ఇచ్చినటువంటి క్వాలిటీ భోజనం ప్రతిరోజు ఇచ్చేలా ప్రయత్నం చేయాలని ఎమ్మెల్యే సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు నాచారం డివిజన్ పుర ప్రముఖులు తదితరులు పాల్గొనడం జరిగింది.

**జయభేరి, ఉప్పల్**





# త్వరలో వంతెన నిర్మాణం పనులు పూర్తి

**జయభేరి, ఘట్కేసర్ :**

రైల్వే వంతెన నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ పోల్ ని ఎలక్ట్రికల్ AE ఏశ్వంత్ కుమార్ తో మాట్లాడి తొలగింప జెస్తున్న ఘట్కేసర్ మాజీ మునిసిపల్ ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్. ఈ సందర్భంగా మాజీ ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ.. వంతెన స్లాబ్ కి అడ్డుగా ఉన్న విద్యుత్ పోల్ ని సంబంధిత అధికాతులతో కలిసి పోల్ తీపించడం జరగిందని, అతి త్వరలో వంతెన నిర్మాణం పనులు పూర్తి చేసి అందుబాటులో కి తెచ్చుకుందామని అని కావున ప్రతి ఒక్కరు సహకరించాలని తెలుపుతూ అతి త్వరలో కోర్టుకు వెళ్లిన 11 మంది సమస్య కూడా పరిష్కారం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కడుపొల్ల మల్లేష్, మాజీ వార్డు సభ్యులు దేవేందర్, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులు, sc సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు మారం లక్ష్మా రెడ్డి, బచ్చు ప్రమోద్, నాగేష్, కమలాకర్, శివరాత్రి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలి

■ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, కాప్రా :**

దేశ సామాజిక న్యాయం సాధనకు గొప్ప కృషి చేసిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలి అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బాబు జగ్జీవన్ రావు వర్ధంతి సందర్భంగా మీర్ పేట హౌసింగ్ బోర్డు కాలనీలో గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాల అభ్యున్నతి, అణగారిన ప్రజల సమాన హక్కుల కోసం బాబు జగ్జీవన్ రామ్ చేసిన పోరాటం మర్చిపోలేనిది. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఉపప్రధానిగా దేశసేవకు అంకితమైన ఆయన జీవితం స్ఫూర్తిదాయకం అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి BRS పార్టీ నాయకులు ప్రవీణ్, జంపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

**జయభేరి, చర్ల, జులై 6 :**





చర్ల మండలంలోనివాసకళ్యాణమండపం నందు ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ అనుబంధ సంఘాల మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి సభాధ్యక్షులుగా ఎమ్మార్పీ సీనియర్ నాయకులు కూరపాటి వీర్రాజుమాదిగ అధ్యక్షత వహించగా ఎంఎస్పి ఎమ్మార్పీఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంచార్జ్ ములకలపల్లి రవి మాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ. గౌరవ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి నాయకత్వంలో గత 30 సంవత్సరాలుగా మాదిగ మాది గొప్ప కులాల హక్కుల సాధన కోసం పోరాటం చేస్తూనే అణగారిన కులాల హక్కుల సాధన కోసం వాళ్లకు, వికలాంగులు వృద్ధులు వితంతు పెన్షన్ల పెంపు కోసం, ఆరోగ్యశ్రీ సాధన కోసం,బియ్యం కోట పెంపు కోసం, సమాజంలో పేదల హక్కుల కోసం పోరాటం చేసినటువంటి ఉద్యమం ఎమ్మార్పీఎస్ ఉద్యమం అని అన్నారు. గౌరవ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారు చేస్తున్న పోరాటం మాదిగల తో పాటు అణగారిన కులాల ఆత్మగౌరవం హక్కులు సమన అవకాశాల కోసమేనని గుర్తు చేశారు.ఈరోజు ప్రతి పేద కుటుంబానికి అందుతున్నాయి అన్న వైద్యం కార్పొరేట్ హాస్పిటల్లో దక్కుతుందన్న అది ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఫలితమే అని అన్నారు. ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీ ఎన్నిక చేయడం జరిగిందని తెలిపారు. అధ్యక్షులుగా మచ్చ రాజా మాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నం రామ్మూర్తి మాదిగ, ప్రధాన కార్యదర్శి పూసం ముత్యాలరావు అధికార ప్రతినిధి కొప్పుల రాంబాబు మాదిగ,ఉపాధ్యక్షులుగా వేల్పుల రామారావు, ప్రచార కార్యదర్శి బోయిళ్ళ ప్రవీణ్ కుసం సత్యనారాయణకార్యవర్గ సభ్యులు మచ్చ బుజ్జిబాబు గుద్దేటి నాగరాజు సూదుల వెంకటేశ్వర్లు చిప్పనపల్లి శ్రీను వారికిల్ల రమణయ్య అలవాల చంద్రయ్య మరియు సీనియర్ నాయకులు పూసం సోమరాజు అదేవిధంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి విహెచ్పిఎస్ మండల కమిటీని ఎన్నిక చేయడం జరిగింది.తదితరులను ఎన్నిక చేయడం జరిగిందిఈ కార్యక్రమంలో ఎంఆర్పి ఎస్ఎంఎస్పీ జిల్లా సీనియర్ నాయకులు పంగి రమణయ్య మాదిగ అలవాల రాజా పెరియార్, ఎంఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు మేకల లత, మచ్చ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

# 20 ఏళ్ల కలకు నేడు నూతన రూపం ఈ C.C. రోడ్డు ప్రారంభం

■ GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి

**జయభేరి, ఎల్బీనగర్ :**



మన్సూరాబాద్ డివిజన్, వివేకానంద నగర్ కాలనీ, రోడ్ నెంబర్ 2లో 47.50 లక్షల నిధుల రూపాయలతో వేసిన C.C. రోడ్డును స్థానికులతో కలిసి జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల తరబడి ఉన్న గణేష్ నగర్ లోని వర్షపునీటి సమస్య, మల్లికార్జున్ నగర్ కమాన్ C.C రోడ్ సమస్య, సహారా స్టేట్స్ లోని B.T రోడ్ల సమస్య,వివేకానంద నగర్ C.C రోడ్ సమస్య తదితర సమస్యలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని పరిష్కరించామని తెలిపారు. వివేకానంద నగర్ C.C రోడ్డు వేయడానికి కర్ణుడికి ఉన్నన్ని శాపాలు ఉన్నాయని కోర్టులో కేసులు, ప్లాట్స్ ఓవర్ లాపింగ్ తదితర వంటి సమస్యలను అధిగమించి ఈ C.C రోడ్డును జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ IAS ప్రత్యేక చొరవతో వేయించడం జరిగిందని ఇది స్థానికులకు దాదాపు 20 ఏళ్ల నాటి స్వప్నం C.C రోడ్డు ప్రారంభమని పేర్కొన్నారు. వివేకానంద నగర్ లో చాలా సమస్యలు మిగిలి ఉన్నాయని వర్షపు నీటి డైవర్షన్, ఏకంగా రోడ్లనే కబ్జాల పర్వం తదితర సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా రోడ్డు లేని అవస్థలు వివేకానంద నగర్ వాసులు ఎదురుకున్నారని అందుకు కృతజ్ఞతగా సభ వేదిక ఏర్పాటు చేసి తులిప్ రావ్ల అసోసియేషన్, మహాలక్ష్మి టవర్స్, జననీ ఎన్ క్లేవ్ అసోసియేషన్, వైభా నెస్ట్ అసోసియేషన్, స్మరణ్ సరోవర్ అసోసియేషన్ అపార్ట్మెంట్ల వాసులు ధన్యవాదాలు తెలిపారని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్యపాల్ రెడ్డి, పుష్పలత, సైదిరెడ్డి, అశోక్, పవన్, సురేందర్ రెడ్డి, వెంకటేష్, సయ్యద్ జానీ, శ్రీరామ్ రెడ్డి, ప్రభాకర్, మధుసూదన్ రెడ్డి, చంద్రారెడ్డి, సురేందర్ రెడ్డి మరియు బిజెపి నాయకులు హరీష్ రెడ్డి, నాంపల్లి రామేశ్వర్, మొరిశెట్టి సంతోష్, దామోదర్ గౌడ్, శ్రీధర్ గౌడ్, మంగారెడ్డి, మట్టారెడ్డి పాల్గొన్నారు.

# కాలనీవాసులు ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ కళ్లెం

**జయభేరి, హయత్ నగర్ :**

హయత్ నగర్ డివిజన్లోని సుభద్ర నగర్ కాలనీ సంక్షేమ సంఘం భవనమునందు కాలనీవాసులు ఏర్పాటుచేసిన సమావేశంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కాలనిలోని సమస్యలు మరియు కాలనిలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలను అడిగి తెలుసుకోవడం జరిగింది, కాలనీవాసుల ప్రధాన సమస్యగా మారిన సర్వేనెంబర్. 14 ప్రోహిబిటెడ్ ఏరియా మరియు మంచి నిట్టి సమస్య, భూగర్భ డ్రైనేజ్ సమస్యను కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, అతి త్వరలోనే పరిష్కారమయ్యే విధంగా ప్రణాళికను రూపొందించామని వారు కాలనీవాసులకు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు లక్ష్మణ స్వామి, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సుబ్రహ్మణ్యం, నరసింహారావు, సత్యనారాయణ, జ్ఞానానందం, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తా..

■ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, కాప్రా :**

డా. ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని భవాని నగర్ లో జరిగిన హోమం, సీనియర్ సిటిజన్ ఆఫీస్ ప్రారంభంలో ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ. భవాని నగర్ లో నెలకొన్న సమస్యలు డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శిరీష సోమ శేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పావని రెడ్డి, BRS పార్టీ నాయకులు మహిపాల్ రెడ్డి, అధ్యక్షుడు శేఖర్, ప్రధాన కార్యదర్శి శ్రీ రాములు, కాలనీ వాసులు, BRS పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు కబ్జాలు చేసి.. అమ్ముకోవడమే సీపీఎం విధానమా..

■ దాడికి పాల్పడిన వారిపై పోలీసులు చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలి

జయభేరి, చర్ల, జులై 6 :




చర్ల మండలంలో బహుజన సమాజ్ పార్టీ నాయకుల సమావేశం భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జి మేడం గుర్రాల దుర్గా భవాని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బహుజన్ సమాజ్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు కడికల శివకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగబద్ధంగా పనిచేసే బహుజన సమాజ్ పార్టీ నాయకులను పార్టీ ఆఫీసులోకి వచ్చి సిపిఎం పార్టీ నాయకులు విచక్షణ రహితంగా దాడి చేయడం, హేయమైన చర్య అన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలను ప్రశ్నించిన విలేకరిపై దాడి చేయడం దుర్మార్గమని ఈ చర్యను బీఎస్పీ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వ భూములు కబ్జాలు చేయడం అమ్ముకోవడమనేది విప్లవ పార్టీగా చెప్పుకునే సిపిఎం పార్టీ చరిత్రకు భంగపాటు అన్నారు. ప్రశ్నించిన వారిని చంపించడమేనా సిపిఎం పార్టీ నాయకత్వ లక్షణం. తక్షణమే బేషరతుగా బహుజన్ సమాజ్ పార్టీ నాయకులకు సిపిఎం పార్టీ నాయకత్వం క్షమాపణ చెప్పాలని, లేదంటే బిఎస్పి భారత రాజ్యాంగ పరిధిలో చట్టపరంగా తీసుకునే చర్యలకు సిపిఎం పార్టీ నాయకత్వం ఇబ్బంది పడవలసి ఉంటుందని హెచ్చరించారు. ప్రభుత్వ భూములు కబ్జాలు చేసి ప్రశ్నించిన వారిపై దాడులు చేసి, పైగా తప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని తెలిపారు. భౌతిక దాడులకు పాల్పడిన సిపిఎం పార్టీ నాయకుల ప్రతి ఒక్కరిపై పోలీసులు చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనియెడల కచ్చితంగా చట్ట పరిధిలో పోరాడుతామని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు కొండా చరణ్, సామల ప్రవీణ్, కొండా కౌశిక్, చెన్నం మోహన్, గుర్రాల విజయకుమార్, పూజారి సామ్రాజ్యం, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరు శివుని అనుగ్రహం పొందాలి

జయభేరి, డిండి :

ప్రతి ఒక్కరు శివుని అనుగ్రహం పొందాలని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. ఆదివారం డిండి మండలం శేషాయిగుంట గ్రామంలో తొలి ఏకాదశి సందర్భంగా శివాలయంలో నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది అని ఆయన అన్నారు.ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలమర్చుకోవాలని అని ఆయన అన్నారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాజనేని వెంకటేశ్వరరావు, PACS చైర్మన్ మాధవరం శ్రీనివాసరావు, కృష్ణయ్య, గిరామోని శ్రీనివాస్, గుర్రం సురేష్ నేత తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు



జయభేరి, దేవరకొండ :

భారతీయ జనతా పార్టీ దేవరకొండ మున్సిపల్ శాఖ అధ్యక్షులు వస్కుల సుధాకర్ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి జయంతి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్నాటి సురేష్, బిజెపి సీనియర్ నాయకులు బెజవాడ శేఖర్, నక్క వెంకటేష్ యాదవ్, నేతల వెంకటేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శులు సముద్రాల సహదేవుడు, చిలక రాజు బిక్కు, చిత్రాల నాగేంద్ర, కోశాధికారి నీల సుమన్, గంజి హరి, వలసాని వెంకన్న, తిరుపతి గౌడ్, మాతంగి ప్రేమ్, సంపంగి సైదులు, చిత్రం ఉదయ్ బాలు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే బాలు నాయక్



జయభేరి, చింతపల్లి :

చింతపల్లి మండల కేంద్రంలో ఎమ్మెల్యే బాలు నాయక్ మహాత్మా గాంధీ విగ్ర ఆవిష్కరణ చేసినారు. విగ్రహ దాత చెట్లపల్లి ప్రసాద్. ఈ కార్యక్రమం చింతపల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వందనపు ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండూరు పవన్ భవాని, చింతపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ముచ్చర్ల యాదగిరి, వెంకటం పేట జూలూరు శ్రీధర్, కొరవి రాధాకృష్ణ, కొరివి యాదగిరి, బాదం యాదగిరి, సముద్రాల నగేష్, చింతపల్లి గ్రామ ప్రజలు,వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్ వితరణ



జయభేరి, దేవరకొండ :

దేవరకొండలో తొలి ఏకాదశి సందర్భంగా వాసవి క్లబ్ అంతర్జాతీయ వారు జిల్లా V104A వారు అంధించినా నోట్ పుస్తకాలు వాసవీ వనిత క్లబ్ దేవరకండ అధ్వర్యంలో పంపిణి చేయటం జరిగింది. ఇందులో భగంగా దేవరకొండ వాసవీ వనితా క్లబ్ అధ్యక్షురాలు మహాలక్ష్మి, కార్యదర్శి భాగ్యమ్మ, కోశాధికారి చంద్రకళ, క్లబ్ సభ్యులు కె పద్మ వై, కె పద్మ ల్, సిహెచ్ శ్రీలత, కె భాగ్య, సముద్రాల దివ్య, కె మౌనిక, గౌతమి, కె వాణి, శ్వేత, రవళి, స్వప్న, కె శ్రీలత, కరుణ,అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## 25 అడుగుల మట్టి గణపతి తొలి కర్ర పూజలు

■ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి

జయభేరి, ఎల్బీనగర్ :

రానున్న వినాయక చవితి సందర్భంగా సరూర్నగర్ పరిధిలోని శ్రీ భవాని శంకర్ ఆలయం మరియు పోచమ్మ ఆలయం వద్ద ఏర్పాటవుతున్న 25 అడుగుల మట్టి మహాగణపతి విగ్రహ ఏర్పాటుకు సంబంధించి, శ్రీ విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన "మొదటి కర్ర పూజ" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి గారు విగ్రహానికి తొలి కర్రను ఎత్తి గణపతిని పూజించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వినాయక చవితి అనేది ఆధ్యాత్మికతకు, ఐక్యతకు ప్రతీక. మట్టి విగ్రహాల ద్వారా ప్రకృతి పరిరక్షణకు మనం తీసుకుంటున్న ప్రతిజ్ఞ ప్రశంసనీయం. శ్రీ గణనాథుని కరుణతో మన గడ్డిఅన్నారం ప్రజలు ఆరోగ్యంగా, సుఖంగా ఉండాలని నేను ఆకాంక్షిస్తున్నాను. యువత చేసే ఈ శ్రద్ధతో ఏర్పాట్లు మన సమాజంలో సాంస్కృతిక విలువలను మరింత బలపరుస్తాయి అన్నారు.

## తాలిపేరు ప్రాజెక్ట్ కుడి ఎడమ కాలువలను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు

జయభేరి, చర్ల, జులై 6 :



చర్ల మండల రైతుల సమస్యలపై తాలిపేరు ప్రాజెక్ట్ కుడి కాలవ, ఎడమ కాలవలను పరిశీలించిన బీఆర్ఎస్ పార్టీ డివిజన్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ మానెం రామకృష్ణ, సాగి శ్రీనివాసరాజు ప్రాజెక్ట్ ఎడమ కాలవకు బోటు గుడెం దగ్గర రెండు చోట్ల గండి కొట్టిందని, వర్షాకాలంలో బారి వర్షాలు ఉండడం చేత ప్రాజక్ట్ లో నీటి విడుదల చేస్తే కొట్టుకు పోయి నీరు మొత్తం కిందకు వెళ్లే అవకాశం లేదని, దీని వలన రైతుల నష్టపోతారని అన్నారు. తాలిపేరు ప్రాజెక్టు డీఈ దీర్ఘకాలికగా పని చేస్తు అవినీతికి అలవాటు పడి ప్రాజక్ట్ కాలువలను పట్టించుకోక పోవడంతో అస్తవ్యస్తంగా తయారు అయ్యాయన్నారు.
రైతుల పట్ల, కాలవల పట్ల ద్వంద వైఖరి చూపిస్తున్న డీఈ ని వెంటనే బదిలీ చేయాలని డివిజన్ నాయకులు డిమాండ్ చేశారు. డీఈ వెంటనే ఈ కాలవపై ఉన్న గండ్లలను పరిశీలించి మరమ్మత్తులు చేయించాలని, కింది ప్రాంతంలో ఉన్న రైతులకి నీరు సకాలంలో అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఈ సమస్య పరిష్కారానికి వారం రోజులలో చర్యలు తీసుకొని యెడల బీఆర్ఎస్ పార్టీ ఉద్యమం చేపడతామని డివిజన్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ మానెం రామకృష్ణ హెచ్చరించారు. అధికారుల నిర్లక్ష్యం అవినీతి వలన ఈ ప్రాంత రైతులు నష్టపోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, కో కన్వీనర్ అయినవోలు పవన్ కుమార్, నాతాని రాము, ఎక్కు ఎంపీటీసీ చంటి, ఎస్సీ సెల్ అధ్యక్షులు కొంబతిని రాము, మండల యూత్ అధ్యక్షులు అంబోజి సతీష్, నాయకులు తడికల బుల్లి అబ్బాయి, సిద్ది. సంతోష్, ఎక్కు సర్పంచ్ కమల అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



## త్యాగనిరతికి, సహనానికి ప్రతీక మొహర్రం

■ ఈ పవిత్ర మొహర్రం పర్వదినం శాంతి, సౌభాగ్యం , మత సామరస్యం వెల్లివిరియాలి

జయభేరి, కొండమల్లేపల్లి :

త్యాగనిరతికి, సహనానికి ప్రతీక మొహర్రం అని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. ఆదివారం కొండమల్లెపల్లి మండలం గుమ్మడవెల్లి గ్రామంలో మొహర్రం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముస్లింలు, హిందువులు కలిసి నిర్వహించే పీర్ల ఊరేగింపు తెలంగాణ ప్రజల మధ్య సఖ్యతను, ఐక్యతను, గంగాజమునా తెహజీబ్‌ను చూపే సందర్భం అని ఆయన అన్నారు. ఈ పవిత్ర మొహర్రం పర్వదినం శాంతి, సౌభాగ్యం, మత సామరస్యం వెల్లివిరియాలి అని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో PACS చైర్మన్ పల్లా ప్రవీణ్ రెడ్డి , పీ ఏ పల్లి బిఆర్ ఎస్ మండల అధ్యక్షులు వెల్లుగురి వల్లపు రెడ్డి ,మారం రవీందర్ రెడ్డి, కేసాని లింగారెడ్డి, వేముల రాజు,ఇస్లావత్ అభిషేక్ నాయక్, రమావత్ రమేష్, మాజీ ఉపసర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు రమావత్ తులసీరాం నాయక్, పీ ఏ పల్లి మాజీ వైస్ ఎం పీ పీ ముఖ్య సలహాదారులు అర్వపల్లి నర్సింహా, రావుల వెంకటేశ్వర్లు,మాజీ సర్పంచ్ లింగం యాదవ్, గ్రామ శాఖ అధ్యక్షులు లాలయ్య, పెద్దిశెట్టి సత్యం, షేక్ ఇస్మాయిల్, రమావత్ కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

## మొహర్రం వేడుకలను సందర్శించిన ఎస్ ఐ అజ్మీర రమేష్

జయభేరి, కొండమల్లేపల్లి :



మొహర్రం వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని, శాంతి భద్రతలను దృష్టిలో పెట్టుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ ఐ అజ్మీర రమేష్ సూచించారు. మండల కేంద్రంలోని గుమ్మడవెల్లి గ్రామంలో ఆదివారం మొహర్రం వేడుకలను సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మొహర్రం పండుగ త్యాగం, స్ఫూర్తికి ప్రతీక అని విశ్వాసం, నమ్మకం కోసం అత్యంత గొప్ప మానవతా హృదయం కలిగిన ముహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ చేసిన బలిదానాన్ని గుర్తు చేసుకోవటమే మొహర్రం అని అన్నారు. మానవ జాతిలో త్యాగం ఎంతో గొప్పదని మంచితనం, త్యాగాన్ని గుర్తు చేసుకోవటమే మొహర్రం వేడుకకు నిజమైన అర్థమని అన్నారు. కర్బలా మైదానంలో హజ్రత్ ఇమామ్ హుస్సేన్ త్యాగానికి ప్రపంచం మొత్తం కన్నీళ్ళతో హజ్రత్ ఇమామ్ హుస్సేన్ ను తలుచుకుంటారని అన్నారు. అలాంటి నీతి నిజాయితీ త్యాగానికి మారుపేరైన మొహర్రం సందర్భంగా గుమ్మడవెల్లి గ్రామ ప్రజలందరూ నిజాయితీగా ఉండాలని అన్నారు. గ్రామంలో పెద్ద శరిగత్ జరుగుతున్న సందర్భంగా ప్రజలందరూ కులమతాలకతీతంగా పీర్ల దగ్గరికి వెళ్లి మటికీలు, దట్టీలు, టెంకాయలు సమర్పించి మొక్కులు తీర్చుకోవడం కోసం గుమ్మడవల్లి గ్రామ ప్రజలతో పాటు వివిధ గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్న సందర్భంగా భక్తులందరికీ ఎలాంటి హాని ఇబ్బందులకు లేకుండా స్వీయ నియంత్రణ పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలని సూచించారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించి ఇతరుల స్వేచ్ఛకు భంగం కలిగిస్తే చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. యువకులందరూ సమన్వయం పాటిస్తూ అగ్నిగుండం చుట్టూ తిరిగే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలోమాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ పంగ మల్లయ్య యాదవ్, పోస్ట్ మాస్టర్ షేక్ జహంగీర్, ఖాజా మొహినూద్దీన్, ముజావర్లు షేక్ బండి మహబూబ్, షేక్ లాల్ ముహమ్మద్, సవారీ లాల్ ముహమ్మద్, షేక్ బడే చాంద్ పాషా, షేక్ సయ్యద్ మియా, షేక్ మహబూబ్, అల్లవుద్దీన్, ముస్తఫా, ఇస్మాయిల్, రహీమ్, అక్బర్, హస్సేన్, హుస్సేన్, ఫెరోజ్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బలహీన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్ రామ్ చేసిన సేవలు మరువలేనివి

■ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తుంకి రమేష్



జయభేరి, శామీర్ పేట్, జులై 6 :

భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని మేడ్చల్ జిల్లా శామీర్ పేట మండల కేంద్రంలో నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తుంకి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొని జగ్జీవన్ రామ్ కు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి బాబు జగ్జీవన్ రామ్ చేసిన సేవలు మరువలేనివి అన్నారు. అదేవిధంగా దళితులకు కూడా సమాన హక్కుల కోసం పోరాడిన మహానేత అని వారు కొనియాడారు. జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ గౌడ్, మాజీ జడ్పీటీసీ పి.బాలేష్, ఏఎంసి డైరెక్టర్ తుంకి భిక్షపతి, నాయకులు తుంకి మల్లేష్ , వంగ నరసింహారెడ్డి, అబ్బగౌని భాస్కర్ గౌడ్, కైరా గణేష్ , మేడి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

## కొల్తూర్ లో ముగిసిన ఉద్దేమర్రి స్వామి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్

■ పోటీలో విజేతగా నిలిచిన న్యాచురల్ స్టార్ట్ టీమ్

■ విజేతలకు కప్ అందచేసిన ఆర్గనైజర్లు

జయభేరి, శామీర్ పేట్, జులై 6 :



మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని కొల్తూర్ గ్రామంలో ఉద్దేమర్రి స్వామి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్ లో చేగువేరా టీం పై పాతబస్తీకి చెందిన నాచురల్ స్టార్ట్ టీమ్ అద్భుత ప్రతిభ కనబర్చి ఘన విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్ ను క్రికెట్ అభిమానులు ఆసక్తిగా తిలకించారు. కాగా ఈ మ్యాచ్ లో విజయం సాధించిన టీమ్ సభ్యులకు ఆర్గనైజర్లు సురేష్, సాయికృష్ణలు కప్ ను అందచేశారు.



# చిక్కుల్లో మహేష్ బాబు..

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబుకు రియల్ ఎస్టేట్ వివాదంలో ఇరుక్కున్నాడు. ఓ సంస్థకు ప్రచారకర్తగా వ్యవహరించిన క్రమంలో , రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ ఆయనకు నోటీసులు జారీ చేసింది. ఓ రియల్ ఎస్టేట్ సంస్థ చేసిన మోసానికి సంబంధించి దాఖలైన ఫిర్యాదులో మహేశ్ బాబు పేరును చేర్చారు. ఒక వైద్యురాలు, ఫోరంలో ఫిర్యాదు చేస్తూ.. బ్రోచర్‌లో మహేష్‌బాబు ఫోటోతో ఉన్న వివరాలను చూసి బాలాపూర్ గ్రామంలో లేఔట్ లో ప్లాట్లు కొనుగోలు చేశామని పేర్కొన్నారు. ప్రతి ప్లాట్‌కు రూ.34.80 లక్షలు చెల్లించిన తర్వాత, అసలు ఆ లేఔట్‌కు అనుమతులు లేవని తేలిందని తెలిపారు. డబ్బు తిరిగి ఇవ్వాలని డెవలపర్స్‌ను ఒత్తిడి చేయగా, సంస్థ ఎండీ కంచర్ల సతీష్ చంద్రగుప్తా కేవలం రూ.15 లక్షల వరకే వాపసు ఇచ్చారని బాధితులు వివరించారు. ఈ నేపథ్యంలో ఫోరం.. సాయిసూర్య డెవలపర్స్, సంస్థ ఎండీ సతీష్ చంద్రగుప్తా, ప్రచారకర్త మహేష్‌బాబులను ప్రతివాదులుగా పేర్కొంటూ నోటీసులు జారీ చేసింది. నోటీసులు అందుకున్న వారు జూలై 8 సోమవారం నాటికి వ్యక్తిగతంగా లేదా న్యాయవాదుల ద్వారా వినియోగదారుల ఫోరంలో హాజరుకావాల్సిందిగా సూచించింది. ఇందులో మహేష్ బాబుని మూడో ప్రతివాదిగా చేర్చడం జరిగింది. మరి దీనిపై మహేష్ బాబు ఏమైన స్పందిస్తాడా అనేది చూడాలి.

ఇక మహేష్ సినిమాల విషయానికి వస్తే ఆయన ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో భారీ ప్రాజెక్ట్ చేస్తున్న విషయం తెలిసిందే.ఈ సినిమా థియేటర్స్ లోకి రావడానికి ఇంకో మూడు నాలుగేళ్లు పడుతుంది. డైరెక్టర్ రాజమౌళి దర్శకత్వం వహించనున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా ఎప్పుడెప్పుడు వస్తుందా.. అని ప్రేక్షకులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. బాహుబలి, ఆర్ఆర్ఆర్ సినిమాల విజయం తర్వాత జక్కన్న మరో భారీ బడ్జెట్ చిత్రం చేస్తుండగా, ఈ మూవీ ఆఫ్రికా అడవుల నేపథ్యంలో సాగే కథతో రూపొందుతుంది. అలాగే ఈ సినిమాలో మహేష్ బాబు కొత్త లుక్ లో కనిపించనున్నాడు. కొన్నాళ్లుగా ఈసినిమా కోసం ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు మహేష్ బాబు.

# ‘లక్కీభాస్కర్’కి సీక్వెల్ తీస్తా



బ్యాంకింగ్ సెక్టార్ నేపథ్య కథాంశంతో రూపొందిన ‘లక్కీ భాస్కర్’ సినిమా గత ఏడాది విడుదలై వందకోట్ల విజయాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ చిత్రానికి సీక్వెల్ తీసే ఆలోచనలో ఉన్నట్టు చిత్ర దర్శకుడు వెంకీ అట్లూరి తన తాజా ఇంటర్వ్యూలో తెలిపారు. ‘లక్కీభాస్కర్’కి తప్పకుండా సీక్వెల్ ఉంటుందని, ఆ కథలో ఆ అవకాశం ఉందని వెంకీ అట్లూరి పేర్కొన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ ‘ లక్కీభాస్కర్’ తర్వాత బయోపిక్స్ చేయాలని పలువురు నిర్మాతలు నన్ను సంప్రదించారు.

కానీ నాకు మాత్రం వాటిని తెరకెక్కించడం ఇష్టంలేదు. థ్రిల్లర్, పీరియాడిక్ చిత్రాలపై నాకు అంత ఆసక్తి ఉండదు. కుంటుంబం అంతా కలిసి హాయిగా కూర్చొని చూసే అందమైన కుటుంబ కథల్ని తెరకెక్కించాలని ఉంటుంది. అందుకు అనుగుణంగానే ప్రస్తుతం సినిమా చేస్తున్నా’ అని తెలిపారు వెంకీ అట్లూరి. ప్రస్తుతం ఆయన సూర్య కథానాయకుడిగా ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం విదితమే. మమితా బైజూ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు.



# మీరున్నారనే నాధైర్యం

సమంత భావోద్వేగానికి లోనయ్యారు. కంటతడి పట్టుకున్నారు. రీసెంట్‌గా ఆమె అమెరికాలో జరుగుతున్న తానా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమెరికాలోని తెలుగు ప్రేక్షకులు తనపై చూపిస్తున్న అభిమానాన్ని గుర్తు చేసుకొని సమంత ఎమోషనల్ అయ్యారు. ‘నా తొలి సినిమా ‘ఏమాయ చేసావె’ నుంచి నన్ను మీ మనిషిలా భావించారు. నాపై అలవిమాలిన ప్రేమను కురిపించారు. మీ ప్రేమకు ధన్యవాదాలు చెప్పుకునే అవకాశం నాకు ఇన్నాళ్లకు దొరికింది.’ అంటూ శిరస్సు వంచి నమస్కరించారు సమంత.


ఇంకా మాట్లాడుతూ ‘ప్రస్తుతం కెరీర్ పరంగా చాలా ముఖ్యమైన దశలో ఉన్నా. రీసెంట్‌గా నిర్మాతను కూడా అయ్యాను. తొలి ప్రయత్నంగా ‘శుభం’ తీశా. తెలుగు వారంతా ఆ సినిమాను చక్కగా ఆదరించారు. మంచి ఫలితాన్నిచ్చారు. మీరు ఎల్లప్పుడూ నా వెంటే ఉంటారనే ధైర్యంతోనే నేను ముందడుగు వేస్తుంటా. మీరు నాకొక ఐడెంటిటీ ఇచ్చారు. మీరే నా కుటుంబం. ప్రాంతాలను బట్టి మనం దూరంగా ఉండొచ్చు. మానసికంగా ఎప్పుడూ మనం కలిసే ఉంటాం.’ అంటూ కంటతడి పెట్టుకున్నారు సమంత.

# శ్రీలీల వైరల్ వయ్యారి సాంగ్..



మాజీ మంత్రి, రాజకీయ నాయకుడు గాలి జనార్ధన రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి హీరోగా ఎంట్రీ ఇస్తున్నాడు. అతను నటిస్తోన్న మొదటి సినిమా జూనియర్. శ్రీలీల ఇందులో హీరోయిన్‌గా నటిస్తుండగా, మరో అందాల తార జెనీలియా మరో కీలక పాత్రలో కనిపించనుంది. ‘వైరల్ వయ్యారి’ అనే పాటకు పవన్ భట్ సాహిత్యం రాశారు. హరిప్రియ, దీపక్ బ్లూ స్వరాలు సమకూర్చారు. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం సమకూర్చారు. ‘జూనియర్’ సినిమా జూలై 18న కన్నడ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రంలో కిరీటి, శ్రీలీలతో పాటు రవిచంద్రన్, జెనీలియా డిసౌజా కూడా ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు. ‘మాయాబజార్’ ఫేమ్ దర్శకుడు రాధాకృష్ణ రెడ్డి ఈ యాక్షన్ ప్యాక్డ్ చిత్రానికి దర్శకత్వం వహించారు. ‘బాహుబలి’, ‘RRR’ వంటి చిత్రాలకు పనిచేసిన కె.కె. సెంథిల్ కుమార్ ‘జూనియర్’ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందించారు. అలాగే పీటర్ హెయిన్స్ యాక్షన్ కొరియోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. మొత్తానికి వైరల్ వయ్యారి’ పాట కిరిటీ రెడ్డి సినిమాపై అంచనాలను పెంచింది.

# తెలుగువారంటే ఫైర్ అనుకున్నారా.. వైల్డ్ ఫైర్.. బన్నీ ఇంట్రెస్టింగ్ కామెంట్స్



అమెరికాలో వైభవంగా జరిగిన నార్త్ అమెరికా తెలుగు సొసైటీ (NATS) 2025 ఉత్సవాలు తెలుగు సంస్కృతి, ఐక్యతకు అద్దం పట్టాయి. ఈ ఘనమైన వేడుకల్లో ప్రముఖులు పాల్గొని సందడి చేశారు. ముఖ్యంగా అల్లు అర్జున్, రాఘవేంద్రరావు, సుకుమార్, శ్రీలీల వేదికపై ప్రత్యక్షమై ప్రవాసాంధ్రులకు మధురానుభూతులు కలిగించారు. వేదికపైకి ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ రాగానే అభిమానులు కేరింతలతో స్వాగతం పలికారు. తన మార్క్ స్టైల్లో "తెలుగు వారంటే ఫైర్ అనుకుంటారా? వైల్డ్ ఫైర్!" అంటూ ‘పుష్ప’ డైలాగ్ పలికి జనాన్ని ఉర్రూతలూగించారు. అంతేకాదు, "నాట్స్ అంటే నేషనల్ అనుకుంటివా? ఇంటర్నేషనల్!" అంటూ సరదాగా స్పందించారు.

అంతర్జాతీయ వేదికపై ఇంతమంది తెలుగు వారిని ఒకేచోట చూడడం హృదయాన్ని తాకుతుంది అని బన్నీ స్పష్టం చేశారు. మీరు విదేశాల్లో ఉన్నా కూడా తెలుగు తనం పరిరక్షిస్తూ, భాషా సంప్రదాయాలను గౌరవిస్తూ అద్భుతంగా నిలబడుతున్నారు. మిమ్మల్ని చూసి గర్విస్తున్నాను. తెలుగోళ్లు ఎక్కడున్నా తగ్గరు!" అంటూ భావోద్వేగంగా మాట్లాడారు. కె. రాఘవేంద్రరావు ఈ వేడుకలో పాల్గొని తన 50 ఏళ్ల సినీ ప్రయాణాన్ని పంచుకున్నారు. అల్లు అర్జున్, శ్రీలీల వంటి తన పరిచయం చేసిన నటులు ఈ వేదికపై నిలబడటం గర్వంగా ఉందన్నారు.సుకుమార్‌ను ఉద్దేశిస్తూ .. "నాకు అడవి రాముడు హిట్ ఇచ్చింది, నీకు అడవి పుష్ప స్టార్ డైరెక్టర్‌గా నిలిపింది అని చమత్కరించారు.

ఇక కుమార్ మాట్లాడుతూ, "నా కెరీర్‌ను మైలు రాయిగా నిలిచిన 1 నేనొక్కడినే చిత్రాన్ని ఆదరించిన అమెరికాలోని తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని ఎప్పటికీ మరిచిపోలేను. మైత్రి మూవీ మేకర్స్ లాంటి గొప్ప నిర్మాణ సంస్థ అందించారంటే, ఇది తెలుగు సినిమా విజయయాత్రకు కారణం" అని అన్నారు.

శ్రీలీల కూడా తన ఉత్సాహభరిత ప్రసంగంతో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. విదేశాల్లోనూ ఈ స్థాయిలో అభిమానుల ఆదరణ చూసి అబ్బురపడిపోయినట్టు తెలిపింది.ఈ కార్యక్రమం కేవలం వినోదానికి మాత్రమే కాదు, తెలుగు సినిమాకు, ప్రవాసాంధ్రుల ఐక్యతకు ప్రతిబింబంగా నిలిచింది. అమెరికాలోని తెలుగువారు తమ భాష, సంస్కృతి పట్ల చూపుతున్న నిబద్ధత, అనురాగం ఈ వేడుకల ద్వారా మరోసారి స్పష్టమైంది అని అన్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. **Cell: 9391 544 889. RNI No: TGTEL/25/A0314.** email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com